క్లుప్తంగా

టంగుటూరి జయంతి వేడుకలు



గూడూరుపల్లె: టంగుటూరి జయంతి వేడుకలు

పుంగనూరు: తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ హైస్కూలులో హెచ్ఎం మహేష్‌నారాయణ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీతో కలసి ప్రకాశం పంతులు స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు రాజేష్, సురేష్‌రెడ్డి, నారాయణ, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, మునిరాజ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 10 నోట్ల కొరతతో ఇబ్బందులు

సదుం: ప్రస్తుతం పలు చోట్ల రూ. 10 నోట్ల కొరత తలెత్తింది. దీంతో ప్రజలు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ నోట్లు తగినంత చెలామణిలో లేకపోవడంతో చిల్లర సమస్య ఏర్పడింది. రూ. 10 నాణేలు చెల్లుబాటు అవుతాయని సాక్షాత్తు రిజర్వ్ బ్యాంకు ప్రకటించినా ఇప్పటికీ వాటిని సామాన్యులు, వ్యాపారస్తులు వాటిని తీసుకోవడం లేదు. మండల స్థాయిలో దీనిపై బ్యాంకర్లు, అధికారులు అవగాహన కల్పించి పది రూపాయల నాణేలు తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

సదుం: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి డాక్టరు సుబ్రమణ్యం కోరారు. గత 20వ తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో తమ సిబ్బంది పశువులకు టీకాలు వేస్తున్నారని, ఇప్పటి వరకు సుమారు 2 వేల పశువులకు టీకాలు వేశామన్నారు. మొత్తం 15,150 టీకాలు అందుబాటులో ఉన్నట్లు ఆయన చెప్పారు. టీకా వేయిస్తే ఆరోగ్యవంతంగా ఉంటాయని, పాల దిగుబడి తగ్గదని స్పష్టం చేశారు. రైతులు అపోహలు వీడీ టీకాలు వేయించాలన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యాధికారులు వంశీకృష్ణ, ప్రసాద్ తెలిపారు. చిత్తూరు అపోలో ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తారని చెప్పారు. ఆస్పత్రికి తరలించే రోగులకు రవాణా, భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్, కడా ప్రత్యేకాధికారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మృతులకు జెడ్పీ చైర్మన్ నివాళి



మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని గుమ్మిరెడ్డిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి, యర్నపల్లెకు చెందిన జయరాంరెడ్డి శుక్రవారం హఠాన్మరణం చెందారు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు పరామర్శించారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా నిచ్చారు.

పేద విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థినులు

రొంపిచెర్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పేద విద్యార్థినులకు బయోజైమ్ ప్రగతి స్కాలర్‌షిప్‌లు అందజేసినట్లు హెచ్ఎం లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం బయోస్టాట్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి జి.నాగరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున అందజేశారు. అందరూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పీహెచ్‌సీలకు సెక్యూరిటీ ప్లీజ్..!



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సెక్యూరిటీ గార్డులను నియమించాలి. ముఖ్యంగా రాత్రి పూట పని చేసే వైద్యులకు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వారికి మనోధైర్యం కల్పించాలి. పీహెచ్‌సీలలో విశ్రాంతి గదులు లేక డాక్టర్లు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. డాక్టర్లకు భద్రత కల్పించాలి. ఎవరైనా దాడులు చేస్తే కఠినంగా శిక్షించేలా చట్టాల్లో మార్పులు తేవాలి.

–డాక్టర్ తేజశ్రీ, 104 , మెడికలాఫీసర్, పుంగనూరు

డాక్టర్లు, ఆస్పత్రులకు భద్రత, రక్షణ ముఖ్యం



కోల్‌కతా ఘటనతో డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రుల్లో సెక్యూరిటీ కల్పించాలి. ప్రభుత్వం డాక్టర్లు, ఆసుపత్రులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరైనా దాడులు చేసినా కఠిన శిక్షలు ఉండేలా చట్టాల్లో మార్పులు చేయాలి. సుప్రీంకోర్టు సూచన మేరకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. తద్వారా వైద్యులు, సిబ్బందికి మనోధైర్యం కల్పించాలి.. ఆస్పత్రి సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలి

–డాక్టర్ శివ, డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధి, పుంగనూరు

పలమనేరు ఆస్పత్రి సమాచారం

ఆస్పత్రి విస్తీర్ణం :	6.2 ఎకరాలు
మొత్తం బెడ్లు :	వంద
రెగ్యులర్, ట్రైనీ డాక్టర్లు :	19 మంది
స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు :	27మంది
ఆస్పత్రిలో మిగతా సిబ్బంది :	150 వరకూ
సెక్యూరిటీ సిబ్బంది :	8 మంది
రోజువారీ ఓపీ :	దాదాపు 500
ఇన్‌పేషెంట్లు :	110మంది వరకు
ఆస్పత్రిలో ఇప్పటికున్న సీసీ కెమెరాలు :	22
పనిచేయని కెమెరాలు :	8

భద్రతా పరమైన సమస్యలివే!

- వందబెడ్ల ఆస్పత్రికి ఇప్పటి వరకూ పోలీస్ ఔట్ పోస్ట్ లేదు
- ఎమ్మెల్సీ కేసుల్లో రాత్రిపూట సైతం ఎంఎస్‌వో పీఎస్‌కు వెళ్లి సమాచారం ఇవ్వాలి
- కొత్తగా నిర్మించిన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 22 సీసీ కెమెరాల్లో 8 పనిచేయడం లేదు. ఇంకా 10 కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.
- ఇక్కడ మూడు షిఫ్టుల్లో కేవలం 8మంది మాత్రమే సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. మరో పదిమంది అవసరం ఉంది.
- ఆస్పత్రిలో 200 దాకా గదులుండగా కావాల్సినంత సెక్యూరిటీ సిబ్బంది లేరు
- మెటర్నటీ ఆస్పత్రి వద్ద ప్రహరీగోడ చాల తక్కువ ఎత్తులో ఉంది, దీంతో ఆగంతకులు సులభంగా లోనికొచ్చే అవకాశం ఉంది.
- రాత్రివేళల్లో అత్యవసర ఆపరేషన్ల కోసం వైద్యులు ఆస్పత్రికి రావాలంటే భయపడుతున్నారు.
- రాత్రివేళ ఎమర్జెన్సీ వద్ద మందుబాబుల బెడద ఎదుర్కొంటున్నారు.

ఆస్పత్రుల్లో భద్రత ప్రశ్నార్థకం

- సీసీ కెమెరాల కొరత
- కనిపించని పోలీస్ ఔట్‌పోస్ట్
- చాలీచాలని సెక్యూరిటీ సిబ్బంది
- తరచూ మందుబాబులతో సమస్య
- నైట్ డ్యూటీల సమయంలో ఇబ్బందులు

పలమనేరు: రోగుల ప్రాణాలను కాపాడే వైద్యులు, సిబ్బందికే ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ, భద్రత ప్రశ్నార్థకమవుతోంది. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి, దారుణ హత్య నేపథ్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో భద్రతపై శుక్రవారం 'సాక్షి' పరిశీలించింది. అలాగే ఆస్పత్రి వైద్యులను కలిసినప్పుడు పలు సమస్యలను తెలియజేశారు.





పలమనేరు ఏరియా ఆస్పత్రి, (ఇన్‌సెట్) పోలీస్ లేక మూతబడ్డ ఔట్ పోస్ట్





ఆస్పత్రిలోకి ఎవరైనా దూకి వచ్చేలా తక్కువ ఎత్తులో ప్రహరీగోడ, బయటి వైపు లేని సీసీ కెమెరాలు

పోలీస్ ఔట్ పోస్ట్‌లో ఒక పోలీసునైనా పెట్టాలి



ఆస్పత్రిలో రాత్రి సమయంలోనూ డాక్టర్లు, సిబ్బంది విధుల్లో ఉంటారు. ఆ సమయంలో ఎంఎల్‌సీ కేసు వస్తే ఆ సమాచారాన్ని పోలీసులకు తెలపాలి. ఆపై ట్రీట్‌మెంట్ ఇవ్వాలి. ఆపరేషన్ కేసులొస్తే రాత్రుల్లో గైనకాలజిస్టులు ఆస్పత్రికి రావాలి. ఆస్పత్రిలో అనుకోని ఏదేని సంఘటన జరిగితే మాకెవరు రక్షణ? అందుకే ఇక్కడ పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి.

–డాక్టర్ మమతారాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్, పలమనేరు

కోల్‌కతా ఘటనతో మేము ఆలోచనలో పడ్డాం



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేదంటే ఏమనిపిస్తుంది? ఇంట్లో తల్లిదండ్రులు టెన్షన్ పడరా?. కోల్‌కతా సంఘటన వైద్యుల్లో ఒకింత భయం, ఆందోళన రేకెత్తించింది. ప్రభుత్వం కచ్చితంగా రక్షణపై ఫోకస్ పెట్టాలి. ఎవరైనా ఇక్కడ డాక్టర్లపై దాడులు చేస్తే మా పరిస్థితి ఏంటి? మేము ప్రశాంతంగా ఉంటేనే కదా రోగులకు సేవలందించేందుకు వీలవుతుంది.

–డాక్టర్ లత, పాథాలజిస్ట్, పలమనేరు

భద్రత చాలా ముఖ్యం



ఆస్పత్రుల్లో రోగుల సేవల కోసం 24 గంటలు పనిచేసే మాకు మానసిక ప్రశాంతత చాలా అవసరం. ఎవరైనా టార్గెట్ చేసి ఇబ్బంది పెడితే పరిస్థితి ఏమిటి? ముఖ్యంగా మహిళా డాక్టర్లకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. కోల్‌కతా సంఘటనతో అందరూ భయపడుతున్నారు. ప్రభుత్వం ఆస్పత్రుల భద్రతపై స్పందించాలి.

–డాక్టర్ శారద, ఆర్ఎంఓ, పలమనేరు

ఆస్పత్రికి తగిన భద్రత కల్పించాలి



మా ఆస్పత్రిలో వందలాది గదులున్నాయి. ఉన్న 8మంది సెక్యూరిటీ సిబ్బందిలో మూడు షిఫ్టుల్లో ముగ్గురు మాత్రమే అందుబాటులో ఉంటారు. వారు ఆస్పత్రిలో రాత్రుల్లో ఎవరెక్కడుంటారో తెలీదు. ఇలాంటప్పుడు ఎవరికైనా ఇబ్బంది, ఆపద తలెత్తితే రక్షించేవారెవరు? అందుకే కోల్‌కతా ఆస్పత్రి సంఘటన జరిగినప్పటి నుంచి మాకు ఆందోళన తప్పడం లేదు.

–డాక్టర్ మారియ, జనరల్ సర్జన్, పలమనేరు

రాత్రుల్లో ఆస్పత్రికి రావాలంటే భయం



ఏరియా ఆస్పత్రిలో నా షిఫ్ట్ డ్యూటీ అయ్యాక ఇంటికెళ్లాక ఏ అర్ధరాత్రో డెలివరీ కేసు సర్జరీ చేయాలని సమాచారం వస్తుంది. ఆ టైమ్‌లో మా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తోడుగా వస్తారు. వారెవరూ లేనప్పుడు రాత్రుల్లో ఆస్పత్రికి ఒంటరిగా స్కూటీలో రావాలంటే మా పరిస్థితి ఏమిటో మీరే అర్థం చేసుకోండి. డాక్టర్లకు కచ్చితంగా భద్రత కల్పించాలి.

–డాక్టర్ మీనాక్షి, గైనకాలజిస్ట్, పలమనేరు

ఇబ్బంది అంతా నైట్ డ్యూటీల్లోనే..



అసలైన ఇబ్బంది అంతా నైట్ డ్యూటీ టైంలోనే ఫేస్ చేస్తుంటాం. ముఖ్యంగా ఎమర్జెన్సీ కొచ్చే రోగుల బంధువులు కొందరు మద్యం మత్తులో ఉంటారు. వారిని కంట్రోల్ చేయలేం. ఆస్పత్రి వద్ద పోలీస్ ఉంటే ఈ సమస్య ఉండదు కదా? అందుకే పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలి. రాత్రుల్లో తప్పనిసరిగా ఒక పోలీస్‌ను ఉంచాలి.

–సరోజ, హెడ్ నర్స్, పలమనేరు

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

- లోకాయుక్త ఆదేశంతో కదిలిన అధికారులు
- రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారుల సర్వే
- రహదారికి ఇరువైపులా ఆక్రమణలకు మార్కింగ్



ఆక్రమణలు తొలగించేందుకు మార్కింగ్ వేస్తున్న రెవెన్యూ, ఆర్అండ్‌బీ సిబ్బంది

చౌడేపల్లె: ప్రైవేటు బస్టాండు నుంచి పుంగనూరు వైపు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణలను తహసీల్దార్ హనుమంతు నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు తొలగించేందుకు ఉపక్రమించారు. ఇక్కడ ప్రైవేటు బస్టాండు నుంచి పాత పోలీస్ స్టేషన్ భవనం వరకు రోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణలకు గురైంది. ఈ రోడ్డు స్థల విషయమై గతంలో స్థానిక బజారువీధికి చెందిన చెన్నరాజశెట్టి లోకాయుక్తలో కేసు వేశారు. లోకాయుక్త ఆదేశాలతో అధికారులు ఆక్రమణలపై దృష్టి సారించారు. సర్వే నంబర్ 210లో రోడ్డుకు ఇరువైపులా సుమారు 30 అడుగుల ఆర్అండ్‌బీ స్థలం ఆక్రమణకు గురైనట్లు తహసీల్దార్ వెల్లడించారు. మొత్తం 727 అడుగుల పొడవునా ఆక్రమణదారులు దుకాణాలు, భవనాలు నిర్మించినట్లు సర్వేలో తేల్చారు. రెండు రోజుల్లోపు మార్కింగ్ ఇచ్చిన ప్రదేశం వరకు ఆక్రమణలు తొలగించాలని ఆక్రమణదారులకు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ నాయక్, సర్వేయర్ గుణశేఖర్, ఆర్అండ్‌బీ ఇన్‌స్పెక్టర్ శివ, వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అక్కదేవతల గుర్రాలు ఊరేగింపు



అక్కదేవతల గుర్రాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

చౌడేపల్లె: అక్కదేవతల గుర్రాలకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగించారు. శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా చౌడేపల్లెకు చెందిన జీవన్ ప్రకాష్, లీలాకుమార్, హనుమాన్ పటేల్, హరిప్రసాద్ ఆధ్వర్యంలో గుర్రాలకు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుతూ పచ్చ పోయించారు. అక్కదేవతల గుర్రాలను చిట్రెడ్డిపల్లె మార్గంలోని సబ్‌స్టేషన్ వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బైపాస్ రోడ్డును పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

- రైతుల అభ్యంతరాలపై సానుకూల స్పందన
- బైపాస్ అలైన్‌మెంట్‌లో మార్పు చేస్తామని హామీ



బైరెడ్డిపల్లె బైపాస్ డిజైన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, పలమనేరు ఎమ్మెల్యే

బైరెడ్డిపల్లె: పలమనేరు–కుప్పం ఎన్‌హెచ్ 42 జాతీయ రహదారిలోని బైరెడ్డిపల్లె బైపాస్ రోడ్డును శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి పరిశీలించారు. ఇటీవల ఎన్‌హెచ్ అధికారుల సర్వే ప్రకారం 2.35 కిలోమీటర్లు దూరం బైపాస్ రోడ్డు నిర్మాణానికి కోసం నిధులు మంజూరయ్యాయి. దీనిపై కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కలెక్టర్ పరిశీలించారు. బైరెడ్డిపల్లె సమీపంలో బైపాస్ రోడ్డు వేస్తే విలువైన భూములు కోల్పోవాల్సి వస్తుందని, అలైన్‌మెంట్ మార్చాలని రైతులు కోరారు. దీనిపై కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించారు. బైపాస్ రోడ్డులో చిన్నపాటి మార్పులు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జగనన్న కాలనీకి రహదారి ఏర్పాటు చేయాలని, ఎక్స్‌ప్రెస్ హైవే రహదారికి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి రైతులుకు ఇబ్బందులు లేకుండా చూడాలని బాధితులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే, ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, ఎన్‌హెచ్ ఈఈ అబ్దుల్ సలాం, తహసీల్దార్ మాధవరాజు, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, మండల సర్వేయర్ సాయిరాజ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోను సస్పెండ్ చేయాలని ధర్నా

పలమనేరు: దళితుల భూములను అగ్ర వర్ణాలకు అక్రమంగా కట్టబెట్టిన పెంగరగుంట వీఆర్వో గోవిందును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహక్కులు, అవినీతి నిర్మూలన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ధర్నా చేశారు. జిల్లా నాయకులు టీవీ మునిరత్నం మాట్లాడుతూ, జంగాలపల్లెకు చెందిన సర్వే నంబర్ 439/1లో 1.88 ఎకరాల దేవేంద్ర, మురగయ్యల నిమ్నజాతి పట్టాను అదే గ్రామానికి చెందిన అగ్రకులాలకు చెందిన చక్రపాణి, నీలమ్మలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాలు మార్చారని ఆరోపించారు. దీనిపై వీఆర్వో గోవిందు వివరణ కోరగా.. తానేమీ అక్రమాలకు పాల్పడలేదని, ఈ ప్రక్రియ మొత్తం నిబంధనల మేరకు చేశామని, పట్టాదారులు ఈ భూమిని గతంలో విక్రయించి ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా రాజకీయం చేస్తున్నారని తెలిపారు.

టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఉపాధి గ్రామ సభలు



మొరం గ్రామసభ వేదికపై కూర్చున్న టీడీపీ నేతలు

- డమ్మీలుగా మారిన పంచాయతీ సర్పంచులు

పలమనేరు: ఉపాధి పనుల ప్రణాళికలపై మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో పచ్చనేతల హవా కనిపించింది. పంచాయతీకి పెద్ద దిక్కైన సర్పంచులు నామమాత్రంగా మారారు. స్పెషలాఫీసర్ కిశోర్ నాయక్, ఎంపీడీఓ రాజేష్, సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. వేదికలపై అధికారులతో పాటు టీడీపీ స్థానిక నేతలు ఆశీనులయ్యారు. టీడీపీ నేతల ప్రతిపాదనలను అధికారులు ఆమోదించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి మండలంలో రూ.1.34 కోట్లతో సీసీ రోడ్లు, రూ.60 లక్షలతో మురుగు కాలువలు, రైతులకు అవసరమైన పనులను ఉపాధి హామీ కింద చేయాలని ఆయా గ్రామ పంచాయతీల్లో ఆమోదాలను స్వీకరించారు.

కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత



కార్మికులతో ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్

పుంగనూరు: అహర్నిశలూ ప్రజల ఆరోగ్యం కోసం సేవలు అందించే కార్మికులు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని కమిషనర్ నరసింహప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులకు వేలూరు సీఎంసీ వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించారు. కొందరు బీపీ, మధుమేహంతో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. వారికి ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులతో కమిషనర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా వారికి మున్సిపాలిటీ తరఫున తక్షణమే వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

పలమనేరులో..

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు స్థానిక అర్బన్ ఆస్పత్రిలో సీఎంసీ వైద్యులతో ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. 200మందికి వైద్య పరీక్షలు చేసి 35మందిని రెఫరల్ సేవలకు సిఫార్సు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు నిరంజన్, ఆశా, జైశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ సద్వినియోగం చేసుకోండి



ఉపాధి పనుల గురించి శెట్టిపేట గ్రామసభలో మాట్లాడుతున్న జేఈ ధనుంజయుడు

చౌడేపల్లె: ఉపాధి హామీ పథకం పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణవేణి కోరారు. శుక్రవారం మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో లేబర్ బడ్జెట్‌ను అనుగుణంగా గుర్తించాల్సిన పనుల వివరాలు, కూలీల పనిదినాల కల్పనపై సమావేశం నిర్వహించారు. ప్రాధాన్యత క్రమంలో భూగర్భజలాలను పెంపొందించే పనులతోపాటు పండ్లతోటలు, పూలతోటలు తదితర పనులను చేసుకోవచ్చని జేఈ ధనంజయుడు తెలిపారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని పొందే హక్కు ఉందని రైతులు, కూలీలు దీనిని తమ జీవనోపాధికి వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో ఏపీఓ శ్రీనివాస్ యాదవ్, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

● రావమ్మా మహాలక్ష్మీ..!



వి.కోట: వరలక్ష్మీ వ్రతమాచరిస్తున్న మహిళలు

వి.కోట/రామకుప్పం: శ్రావణ మాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని వి.కోట, రామకుప్పం మండలాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఉపవాస దీక్షలతో ఆచరించారు. రెండవ వారంలో వ్రతమాచరించని పలువురు మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీదేవి ప్రతిమలను ఉంచి పూజలు చేశారు. ముత్తయిదువులకు వాయనాలు సమర్పించారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గ్రామసభల ఆమోదంతోనే అభివృద్ధి పనులు



కోగిలేరులో నిర్వహిస్తున్న గ్రామసభ

పెద్దపంజాణి: గ్రామసభల ఆమోదంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడానికి వీలుంటుందని ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. కోగిలేరు పంచాయతీలో సర్పంచ్ రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధిహామీ పనులను గ్రామసభ ఆమోదం పొందిన తర్వాతనే చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఏయే పనుల చేయవచ్చో ఏపీఓ చిన్న రెడ్డెమ్మ వివరించారు. కార్యక్రమంలో పీఎస్ మహేశ్వర్, వీఆర్వో సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధి పనులకు సంబంధించి శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని సచివాలయాల వద్ద సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజానిధుల సమక్షంలో ఉపాధి పనులను ఆమోదించారు. గ్రామ పంచాయతీల్లో నమోదు చేసుకున్న వారికి 100 రోజులు, ఆర్ఓఎఫ్ఆర్ లబ్ధిదారులకు 150 రోజులు ఉపాధి పనులు కల్పిస్తామని ఎంపీడీఓ రాజేంద్రబాలాజి ప్రకటించారు. గ్రామసభల్లో ఆమోదం తెలిపిన పనులకు మాత్రమే నిధులు విడుదల అవుతాయన్నారు.

సదుంలో..

సదుం: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు కోరారు. మండలంలోని పంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో పనులను గుర్తించి ప్రణాళికలు రూపొందించేందుకు గ్రామ సభలు నిర్వహించారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రెడ్డెప్ప ఆచారి కోరారు. గ్రామసభల్లో ఆయన మాట్లాడుతూ..కూలీలకు పనులు చేసే ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీఓ బాలమురళి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం: మండలంలోని 23 పంచాయతీలలో గ్రామ సభలను నిర్వహించారు. మౌలిక సదుపాయాల కల్పన, జలసంరక్షణ, వ్యవసాయ అనుబంధ పనులపై ప్రతిపాదనలు స్వీకరించారు. మొత్తం 87 రకాల పనులను ఉపాధి కూలీలు, లబ్ధిదారులు చేసుకోవచ్చని అధికారులు చెప్పారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



కొలమాసనపల్లెలో నిర్వహిస్తున్న అంతరిక్ష దినోత్సవం

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల, స్థానిక డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొలమాసనపల్లె విద్యార్థులు నేషనల్ స్పేస్‌డే విత్ బ్రిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు ప్రిన్సిపల్ తెలియజేశారు. వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, అధ్యాపకులు, కొలమాసనపల్లెలో హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.